క్లుప్తంగా

బంగారమ్మతల్లి ఆలయ ప్రతిష్ఠ



అమ్మవారి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీటీసీ తదితరులు

గజపతినగరం రూరల్: మండలంలోని ముచ్చర్ల గ్రామంలో బంగారమ్మతల్లి అమ్మవారి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం వేదపండితుల మంత్రోచ్ఛరణాల నడుమ ఘనంగా జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీటీసీ గార తవుడు మాట్లాడుతూ గ్రామ ఇలవేల్పు బంగారమ్మతల్లి అని అన్నారు. ఆలయ నిర్మాణం చేసేందుకు గ్రామస్తులు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కరుముజ్జి కృష్ణ, ఉప సర్పంచ్ మీసాల సన్యాసినాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి



గర్భిణులతో మాట్లాడుతున్న వైద్యాధికారిణి స్రవంతి

దత్తిరాజేరు: గర్భిణులు జాగ్రత్తలు పాటించాలని కె.కొత్తవలస వైద్యాధికారిణి స్రవంతి అన్నారు. ఆస్పత్రిలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 34 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు శుక్రవారం నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. పాలు, గుడ్లు, కాయగూరలు అవసరం మేరకు తీసుకోవాలని సూచించారు. గర్భిణులు తప్పనిసరిగా వైద్యులు సలహాలు పాటించాలన్నారు.

సత్యసాయి భజన మండలి ఔదార్యం



గర్భిణులకు భోజనాలు వడ్డిస్తున్న వైద్యాధికారిణి సామ్రాజ్యలక్ష్మి

జామి: స్థానిక పీహెచ్‌సీలో వైద్య పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులకు సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో శుక్రవారం భోజనాలు ఏర్పాటు చేశారు. వైద్యాధికారిణి సామ్రాజ్యలక్ష్మి నేతృత్వంలో భోజనాలు పెట్టారు. యల్లమాంబ స్వీట్స్ యజమాని జి.ప్రసాద్ దంపతులు వీటిని ఏర్పాటు చేశారు. భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటించండి



ద్విచక్ర వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ భాస్కరరావు

గుర్ల: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ భాస్కరరావు సూచించారు. మండలంలోని సొలిపిసోమరాజు పేట వద్ద వాహనాలను శుక్రవారం తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేసారు. ఆటోలు, కారులను తనిఖీ చేసారు. ఎటువంటి మత్తు పదార్థాలు రవాణా కాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

మద్యం సీసాల స్వాధీనం



మద్యం సీసాలతో నిందితుడిని పట్టుకున్న పోలీసులు

బొండపల్లి: మండలంలోని జె.గుమడాం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి నుంచి 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్టు ఎస్‌ఐ కె.లక్ష్మణరావు తెలిపారు. గ్రామానికి చెందిన మంత్రి చంద్రినాయుడు అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు గతంలో కూడా పట్టుబడటంతో నిందితుడుపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు చెప్పారు.

ఘనంగా ముత్యాలమ్మ తల్లి ఉత్సవ ఊరేగింపు



ముత్యాలమ్మ అమ్మవారి ఉత్సవ ఊరేగింపు జరుపుతున్న భక్తులు

జామి: మండలంలోని అలమండ గ్రామంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకిలో ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

- అంబేడ్కర్ విగ్రహంపై దాడి హేయమైన చర్య
- మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



కొత్తవలస: అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తదితరులు

కొత్తవలస: రాష్ట్రంలో తెలుగుదేశం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అరాచక పాలన సాగుతోందని, విజయవాడలోని అంబేడ్కర్ విగ్రహంపై జరిగిన దాడి హేయమైన చర్య అని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. అంబేడ్కర్ విగ్రహంపై దాడిని నిరసిస్తూ కొత్తవలస జంక్షన్‌లో గల అంబేడ్కర్ విగ్రహానికి పార్టీ నాయకుడు నెక్కల నాయుడుబాబుతో కలిసి ఆయన శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. అనంతరం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో రాజ్యాంగ విలువలను కాపాడాల్సిన పాలకులు నిరంకుశంగా వ్యవహరిస్తూ అరాచక పాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. కూటమి పాలనలో రాష్ట్రంలో విధ్వంసకర పాలన సాగుతోందన్నారు. ఈ దాడులు దళితులను కించపరిచేవనని ధ్వజమెత్తారు. దాడులకు పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఒబ్బి నాయుడు, ఇతర నేతలు గొరపల్లి శివ, బొంతల వెంకటరావు, పల్లా భీష్మ, వై.మాధవరావు, సర్పంచ్‌లు మచ్చ ఎర్రయ్యరామస్వామి, దేముడు, కొండలరావు, ఎంపీటీసీ ఎస్.రమణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో నిరంకుశ పాలన



గజపతినగరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

గజపతినగరం: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిరంకుశ పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ నేతలు ధ్వజమెత్తారు. అంబేడ్కర్ విగ్రహంపై విజయవాడలో జరిగిన ముష్కరుల దాడిని నిరసిస్తూ గజపతినగరం మెయిన్‌రోడ్డులో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విధ్వంసకర పాలన సాగుతోందన్నారు. దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉన్న శిలాఫలకంపై ఉన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేరును తొలగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ విలువలను కాపాడాల్సిన పాలకుల అండతోనే ఇటువంటి దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ సందర్భంగా జైభీమ్.. అంటూ నినాదాలు చేశారు. జెడ్పీటీసీ గార తవుడు, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు బూడి వెంకటరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేతలు బెల్లాన త్రినాధరావు, కర్రి రామునాయుడు, శీర రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు విద్యాబోధనతో ఆకట్టుకోవాలి



మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఆర్‌జేడీ విజయ్‌కుమార్

- ఆర్‌జేడీ విజయ్‌కుమార్

కొత్తవలస: ఉపాధ్యాయులు తమ గుణాత్మకమైన విద్యాబోధనతో విద్యార్థులను ఆకట్టుకోవాలని, ప్రణాళికాబద్ధంగా బోధన చేయాలని పాఠశాల విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి.విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఏపీ మోడల్ స్కూల్‌ను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం తయారు చేయాలని, రుచికరంగా ఉండాలని అన్నారు. భోజనం విద్యార్థులు పారబోసే విధంగా ఉండకూడదని సూచించారు. అనంతరం మండలంలోని ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలోనే పూర్తి స్థాయిలో చదవడం, రాయడం రావాలన్నారు. ఉపాధ్యాయులు బోధనా ప్రణాళికను రూపొందించుకోవాలన్నారు. సమావేశంలో ఎంఈఓలు జి.శ్రీదేవి, బి.శ్రీనివాసరావు, పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఐ బాధ్యతల స్వీకరణ



సీఐ రమణ

గజపతినగరం: గజపతినగరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా జి.ఎ.వి.రమణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు గజపతినగరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన ఎన్.వి.ప్రభాకరరావును వీఆర్‌లో ఉంచారు. ఆయన స్థానంలో రమణ వచ్చారు.

12 నుంచి సర్పంచ్‌లకు శిక్షణ

దత్తిరాజేరు: సర్పంచ్‌లకు ఈ నెల 12నుంచి 14వ తేదీ వరకు మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రకుమారి శుక్రవారం తెలిపారు. ఎంపీపీ గేదెల సింహద్రి అప్పలనాయుడు శిక్షణ తరగతులను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ నిర్వహణ అభివృద్ధి, తదితర కార్యక్రమాలపై శిక్షణ పొందిన సీనియర్ కార్యదర్శులు మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తారని తెలిపారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలు ప్రారంభం

చీపురుపల్లి: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ చదవాలనుకునే వారికి ప్రవేశాలు ప్రారంభమైనట్లు ఓపెన్ స్కూల్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ గదుల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాల కోసం ఆగస్టు 27లోగా ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఫీజు చెల్లించుకోవచ్చునని తెలిపారు. ఆగస్టు 28 తరువాత సెప్టెంబర్ 4 వరకు రూ.200 అపరాధ రుసుముతో ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ చదవాలనుకునే వారు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సంప్రదించాలని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ సరికాదు

శృంగవరపుకోట: ఎస్సీల్లో చిచ్చు పెట్టేలా సుప్రీం ఎస్సీల వర్గీకరణపై చెప్పిన తీర్పును నిరసిస్తూ ధర్మవరం గ్రామంలో జైభీమ్ షెడ్యూల్ కాస్ట్, ట్రైబ్స్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు బసవ సూర్యనారాయణ నేతృత్వంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆర్టికల్ 341కు విరుద్ధంగా భారత రాజ్యాంగాన్ని అగౌరవ పరుస్తూ ఎస్సీ వర్గీకరణ చేస్తాం అంటూ ప్రకటించడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఎస్సీల వర్గీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకుంటే దేశవ్యాప్తంగా ఉద్యమానికి సిద్ధం అవుతామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పాంగి కృష్ణారావు, విశ్రాంత తహసీల్దార్ వి.సన్యాసప్పడు, సర్పంచ్ గాలి సన్యాసయ్య తదితరులు అంతా హాజరయ్యారు.

ఆదివాసీ దినోత్సవం



ఆదివాసీ దినోత్సవంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేశవరావు

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా.సి.హెచ్.కేశవరావు మాట్లాడుతూ ఆధునిక సమాజ గత కాలపు ఆనవాళ్లు, సమష్టి జీవన పద్ధతులు, పారదర్శకతకు ఆదివాసీలు నిలువెత్తు సాక్ష్యాలు అన్నారు. జీవన పోరాటంలో ఆరితేరిన వారు ఆదివాసీలు అన్నారు. ఆదివాసీల కుటుంబాలను పేదరికం నుంచి బయటకు తీసుకు వచ్చేందుకు ప్రభుత్వాలు నిధులు కేటాయించాలని వారిని ఉద్ధరించేలా ప్రభుత్వ పథకాలు ఉండాలన్నారు. పలువురు లెక్చరర్లు పాల్గొన్నారు.

ఆదివాసీల అభివృద్ధికి చొరవ చూపాలి



ఆదివాసీ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఆదివాసీ, దళిత నేతలు

వేపాడ: ఆదివాసీల అభివృద్ధికి పాలకులు చొరవ చూపాలని ఆ సంఘ నేతలు అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని గిరిజన సమైక్య నేతలు మండల కేంద్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నేటికీ గిరిజన, దళిత వర్గాల అభ్యున్నతికి ఏ ప్రభుత్వాలు పని చేయడం లేదన్నారు. ఆదివాసీ గ్రామాలకు నేటికీ విద్యుత్, రహదారి వంటి కనీస సదుపాయాల్లేవన్నారు. ఎస్సీల రిజర్వేషన్‌పై సుప్రీం కోర్టు తీర్పును నిరసిస్తూ ఈ నెల 15న బ్లాక్ డే పాటించనున్నట్టు తెలిపారు. ఆదివాసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు గౌరునాయుడు, సన్యాసిరావు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయవాదులు

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి పంచాయతీ పరిధిలోని శివారు గిరిజన గ్రామమైన కొండవానిపాలెం గ్రామంలో గజపతినగరం మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో గజపతినగరం ఫస్ట్‌క్లాస్ కోర్టు న్యాయమూర్తి బి.కనకలక్ష్మి ఆదేశాల మేరకు న్యాయ అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు న్యాయవాదులు పి.శ్రీనివాసరావు, జి.సూర్యనారాయణ వితంతువుల పింఛన్లతో పాటు వారి రక్షణ కోసం తీసుకున్న చట్టాలు పట్ల అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో దేవుపల్లి పీహెచ్‌సీ వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించి వైద్య సేవలను అందించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ బి.నారాయణప్పలనాయుడు, న్యాయవాదులు బి.సాయికిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కోసం రైతుల ఆందోళన



కొండగంగుబూడిలో ఎరువుల కోసం రైతుల ఆందోళన

వేపాడ: మండలంలోని కొండగంగుబూడి రైతు సేవా కేంద్రం పరిధిలో ఎరువులు అందించకపోవడంపై రైతులు శుక్రవారం ఆందోళన చేశారు. రైతు సేవా కేంద్రానికి ఎరువులు వచ్చి మూడు రోజులు అవుతున్నా పంపిణీ చేయకపోవటంతో ఆవేదన వ్యక్తం చేసారు. ఎరువుల స్టాకు పాయింట్ వద్ద నిరసన తెలిపారు. దీంతో మండల వ్యవసాయాధికారి స్పందించి స్థానికంగా నెలకొన్న సమస్య వల్ల పంపిణీలో జాప్యం ఏర్పడిందన్నారు. వీఏఏల ద్వారా శుక్రవారం సేవా కేంద్రం పరిధిలోని రైతులకు యూరియా ఆరు టన్నులు, డీఏపీ 12 టన్నులు పంపిణీ చేసామన్నారు. అవసరమైన ఎరువులకు ఇండెంట్ పెడతామని ఏఓ యశ్వంతరావు తెలిపారు.

శ్రావణ శోభ

- పసుపు కొమ్ములతో అమ్మవారికి అలంకరణ
- ఘనంగా సామూహిక కుంకుమార్చనలు



పసుపు కొమ్ములతో అలంకరించిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారు

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శ్రావణ శోభ సంతరించుకుంది. శ్రావణమాసంలో భాగంగా తొలి శుక్రవారం పురస్కరించుకుని దేవదాయశాఖ, ఆలయ కమిటీ సంయుక్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పసుపు కొమ్ములతో అలంకరించారు. అంతేకాకుండా అమ్మవారి దేవస్థానం మండపంలో నిర్వహించిన సామూహిక కుంకమార్చన పూజల్లో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. శ్రావణమాసం కావడంతో శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు.

రాష్ట్రంలో మద్యాన్ని నిషేధించాలి

- ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మి



ర్యాలీలో పాల్గొన్న ఐద్వా సభ్యులు

గజపతినగరం: క్విట్ ఇండియా డే స్ఫూర్తితో మద్యం, గంజాయిలను పూర్తిగా నిషేధించాలని ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు వి.లక్ష్మి డిమాండ్ చేశారు. క్విట్ ఇండియా డేను పురస్కరించుకొని గజపతినగరం మండలం పురిటిపెంట ఎస్సీ కాలనీలో ఆమె ప్రభుత్వానికి వ్యతిరేకంగా శుక్రవారం ర్యాలీ చేపట్టి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేడు దేశ పాలకులు అంతా మద్యాన్ని ప్రధాన ఆదాయ వనరుగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆగస్టు 9 క్విట్ ఇండియా డే సందర్భంగా డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఉద్యమాలు ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే వాటిని నిషేధించాలని అన్నారు. మద్యం, గంజాయి సేవించడం వలన యువత తప్పుదోవ పడుతున్నారని, మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు, హత్యలు సాధారణమయ్యాయని తెలిపారు. జిల్లాలోని రామభద్రపురం మండలం జీలుగువలసలో ఐదు నెలల పసికందు, బొబ్బిలిలో కన్న తండ్రే కూతురుపై, నెల్లిమర్లలో ఓ కానిస్టేబుల్ కుమార్తెపై అత్యాచారాలు జరిగిన సంఘటనలు చూస్తుంటే సమాజం ఎటు వెళ్తందోనన్న ఆందోళన నెలకొందన్నారు. మహిళలకు రక్షణ కల్పించాలని, మహిళా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి నిందితులను వెంటనే శిక్షించాలని కోరారు. ఐద్వా సహాయ కార్యదర్శి ఆర్.హరికృష్ణవేణి, జి.రత్నసాగరి, నగర పైడమ్మ, నగర పెంటమ్మ, వసంత అప్పలరాము, జె.వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కెల్ల హైస్కూల్‌లో డిప్యూటీ ఈఓ విచారణ

సాక్షి ఎఫెక్ట్...



కెల్ల హైస్కూల్‌లో విచారణ జరుపుతున్న డిప్యూటీ ఈఓ కె.వి.రమణ

గుర్ల: మండలంలోని కెల్ల ఉన్నత పాఠశాలలో తరగతుల్లో ఉండాల్సిన విద్యార్థులు మధ్యాహ్న భోజన వంట పనుల్లో నిమగ్నం కావడంపై 'ఇది చదు'వంట' శీర్షికన 'సాక్షి'లో శుక్రవారం ప్రచురితమైన ఫొటో వార్తకు అధికారులు స్పందించారు. డిప్యూటీ ఈఓ కె.వి.రమణ విచారణ జరిపారు. విద్యార్థులను వంట పనులకు వినియోగించ రాదంటూ అక్కడి భోజన నిర్వాహకులకు సూచించారు. విద్యార్థులు వంట పనుల వద్దకు వస్తే తరగతులకు వెళ్లమని చెప్పాలన్నారు. విద్యార్థులు చదువుపైనే దృష్టిసారించేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఎంఈఓలు ఎస్.భానుప్రకాష్, శ్రీనివాసరావు ఉన్నారు.

చేసిన సేవలే గుర్తింపునిస్తాయి...



పదవీ విరమణ చేసిన ప్రకాశరావు దంపతులను సన్మానిస్తున్న మండల పరిషత్ సిబ్బంది, అధికారులు

వేపాడ: ఉద్యోగికి తన పదవీ కాలంలో ప్రజలకు చేసిన సేవలతోనే గుర్తింపు లభిస్తుందని ఎంపీడీఓ నిశ్చల అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలనాధికారిగా పని చేసి ఇటీవల పదవీ విరమణ చేసిన జీవీవీబీఎస్ ప్రకాశరావు దంపతులను శుక్రవారం కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు సేవ చేయాలనే దృక్పథంతో పని చేయాలన్నారు. ఈఓ పీఆర్‌డీ ఉమా, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

క్విట్ కార్పొరేట్



ఎస్.కోటలో రాస్తారోకో చేస్తున్న సీఐటీయూ నేతలు

శృంగవరపుకోట: దేశంలో కార్పొరేట్ కంపెనీలను ప్రోత్సహించొద్దు.. ప్రజల ఆస్తులు అమ్మేసి జీవితాలను తాకట్టు పెట్టొద్దు.. అంటూ సీఐటీయూ నేతలు ప్రజా సంఘాలతో కలిసి శుక్రవారం పట్టణంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాడి అప్పారావు, సిటు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ ఆగస్టు 9న స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా క్విట్ ఇండియా నినాదం ఊపిరి పోసుకుందన్నారు. అదే స్ఫూర్తితో 'క్విట్ కార్పొరేట్' నినాదంతో దేశంలో వ్యవసాయ రంగాన్ని రక్షించుకునే పోరాటానికి సీపీఎం పిలుపునిచ్చిందన్నారు. గిరిజన, రైతుల హక్కులు కాలరాసే నల్లచట్టాలు బీజేపీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో పలు అనుబంధ సంఘాల సభ్యులు, నాయకులు, హాజరయ్యారు.